క్లుప్తంగా

స్నేహితురాలికి అండగా పూర్వ విద్యార్థులు



తరిగొప్పుల: మండలకేంద్రానికి చెందిన యాటెల్లి ఇస్సాక్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. కాగా, మృతుడి కుమార్తె సుజాతతో కలిసి చదువుకున్న 2009–10 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆపదలో స్నేహితుల ఫౌండేషన్ తరఫున రూ.10వేల నగదును ఇస్సాక్ కుమార్తెకు గురువారం అందజేశారు.

ఆర్థికసాయం



బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామంలో అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గడ్డల శోభకు సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ ఆర్థిక సహాయాన్ని అందించారు. గురువారం ఆస్పత్రిలో శోభను పరామర్శించి ఖర్చులకు రూ. 5వేలను అందించారు. మల్గ అనిల్, చల్ల మంజేకర్, మైల వెంకటేష్ ఉన్నారు.

ఏఈఓగా ప్రశాంత్‌ను తిరిగి నియమించాలి



జఫర్‌గఢ్: తమ్మడపల్లి (జి) క్లస్టర్ పరిధిలో ఏఈఓగా పని చేసిన మొట్టక ప్రశాంత్‌ను తిరిగి నియమించాలని ఓబులాపూర్, తమ్మడపల్లి (జి) గ్రామాల రైతులు కోరారు. ఈ మేరకు స్టేషన్‌ఘన్‌పూర్ ఏడీఏ వసంత సుగుణకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో వారు మాట్లాడుతూ గత కొన్నేళ్ల పాటు తమ్మడపల్లి (జి) క్లస్టర్ పరిధిలో ఏఈఓగా పని చేసిన ప్రశాంత్ రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందించారన్నారు. అతనిని అకస్మికంగా పాలకుర్తికి బదిలీ చేశారన్నారు. ఇప్పటి వరకు తమ్మడపల్లి (జి) క్లస్టర్ పరిధిలో ఎవరు పని చేస్తున్నారో తెలియడం లేదన్నారు. గతంలో పని చేసిన ప్రశాంత్‌ను తిరిగి ఇక్కడ నియమించాలని వారు కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుజ్జరి రాజు, మాజీ సర్పంచ్‌లు అన్నెపు పద్మ అశోక్, మారపల్లి స్వప్న ప్రభాకర్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



లింగాలఘణపురం: మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఎస్సై శ్రావణ్‌కుమార్ చేతుల మీదుగా ఫొటో ఎక్స్‌పో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ముఖ్య సలహాదారుడు చరుమల్ల శ్రీనివాసు, మండల అధ్యక్షుడు మైలారం అనిల్, కార్యదర్శి ఉపేందర్, కుటుంబ బరోసా కన్వీనర్ విజయ్, సహాయ కార్యదర్శి రాజశేఖర్, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీతాఫలాల వేలం రూ.3.31లక్షలు



బచ్చన్నపేట: మండలంలోని మన్‌సాన్‌పల్లి, సాల్వాపూర్ గ్రామాల్లో గల ఫారెస్ట్ భూమిలోని సీతాఫలాలకు వేలం పాట రూ.3.31లక్షలు పలికినట్లు జిల్లా అటవీ క్షేత్రాధికారి ఆర్.కొండల్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మన్‌సాన్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలంపాటలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన పలువురు వేలం పాటలో పాల్గొనగా పొన్నం కృష్ణకాంత్ అనే వ్యక్తి వేలంపాటను దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ రమేశ్, ధర్మరాజు, ఇజాజ్ అహమద్, అఖిల్, మాజీ సర్పంచ్ పంజాల తార శ్రీధర్‌గౌడ్, పీఎస్ఎస్ చైర్మన్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు గజవెల్లి వెంకన్నను గురువారం మంత్రి సీతక్క సన్మానించారు. ములుగు జిల్లా గిరిజన భవన్‌లో ఎస్సీ, బీసీ ఉప కులాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాకారుడిగా గుర్తింపు పొందిన వెంకన్న సన్మానం పొందారు.

ప్రమాదకరంగా లోలెవల్ కాజ్‌వే

- తాత్కాలిక మరమ్మతులు తప్పని ప్రమాదాలు
- నిత్యం వందలాది వాహనాల రాకపోకలు

నర్మెట: నర్మెట–జనగామ ప్రధాన రహదారి..వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు.. వర్షాకాలం వచ్చిందంటే లో లెవల్‌కాజ్‌వేపై నుంచి నీటి ప్రవాహం..చీకటి పడిందంటే ఎదురుగా వచ్చేవాహనాల లైట్ల వెలుతురుకు పొలాల్లోకి దూసుకెళ్తున్న వాహనాలు.. గాయాల పాలవుతున్న ద్విచక్ర వాహనదారులు. ఊర చెరువు మత్తడి పోసిందటే మరింత ప్రమాదం. లో లెవల్ కాజ్‌వే కింది పైపులు మట్టితో నిండి పోవడంతో పైనుంచి నీరు ప్రవహిస్తూ రోడ్డు ప్రమాదంగా మారింది. దీంతో ఇరువైపులా మట్టిని తొలగించే క్రమంలో తాత్కాలిక మరమ్మతులో భాగంగా లోతైన గుంతలు తీశారు. ఈదారిలో వెళ్తే జనగామ నుంచి కరీంనగర్ 88 కి.మీ. మాత్రమే కావడంతో నర్మెట–హుస్నాబాద్–కరీంనగర్‌కు బస్సులు, ఆయిల్, పాల ట్యాంకర్లు, ఇసుక లారీలు, కార్లు, భారీవాహనాలు, నిత్యం 1,500 పైగానే వెళ్తుంటాయి. ఆర్ అండ్ బీ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, తక్షణం శాశ్వత మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న లో లెవల్ కాజ్‌వే

నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి



నిత్యం పలు పనులమీద మండల కేంద్రానికి వచ్చి వెళ్తుంటాం. గత నాలుగేండ్లుగా ఇదే పరిస్థితి. ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో పది రోజుల క్రితం స్వల్ప గాయాలతో బయట పడ్డాను. అధికారుల నిర్లక్ష్య వైఖరితో ప్రజల ప్రాణాలు పోయేట్టుగావున్నాయి.

– మాలోత్ సీతారాం నాయక్, బొమ్మకూర్

అధికారులు తక్షణం స్పందించాలి



వాహనాల రాక పోకలతో నిత్యం రాత్రి పగలు రద్దీగా ఉండే మార్గం...ఏండ్లు గడుస్తున్నా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారులకు, పాలకులకు పట్టడంలేదు..ప్రజల ప్రాణాలపై ఇంత నిర్లక్ష్యమా..! తక్షణం శాశ్వత మరమ్మతులు చేపట్టాలి.

– ఎండీ తఫ్షిల్, సామాజిక సేవా కార్యకర్త

ఎంసీహెచ్‌లో వైద్యుల నిర్లక్ష్యం

ప్రైవేటు ఆస్పత్రిలో గర్భిణి ప్రసవం

జనగామ: జనగామ చంపక్‌హిల్స్ మాతాశిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ గర్భిణి చివరకు ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవించిన ఘటన గురువారం వెలుగులోకి జరిగింది.

బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాలఘనపురం మండలం ఏనెబావి గ్రామానికి చెందిన పుట్ట రేఖ తన రెండో సంతానం కోసం కుటుంబ సభ్యులతో కలిసి ఎంసీహెచ్‌కు వచ్చారు. వైద్యుల వద్దకు వెళ్లి ప్రసూతి చేయాలని కుటుంబసభ్యులు అడుగగా, విధుల్లో ఉన్న వైద్యులు ప్రసూతికి ఇంకా సమయం ఉందని తిరిగి పంపించారు. అప్పటికే రెండుసార్లు పురిటినొప్పులతో ఆసుపత్రికి తీసుకురాగా, కాన్పు చేయకపోవడంతో గురువారం మూడోసారి తీసుకొచ్చారు. అప్పటికీ ఎంసీహెచ్ వైద్యులు కాన్పు చేయలేమని స్పష్టంగా తేల్చి చెప్పడంతో తీవ్ర వేదనతో గర్భిణిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వెంటనే చికిత్స అందించి, సురక్షితంగా కాన్పు చేయగా, పాపకు జన్మించిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై రేఖ మామయ్య పుట్ట సిద్ధులు స్పందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి నిర్లక్ష్యం జరగడం విచారకరమన్నారు. సంబంధిత వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంసీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఈ విషయం తన దృష్టికి రాలేదని, విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

కొనసాగుతున్న యూరియా కష్టాలు



స్టేషన్‌ఘన్‌పూర్ పీఏసీఎస్ వద్ద క్యూలో ఉన్న రైతులు



క్యూలలో రైతుల తోపులాట



జఫర్‌గఢ్: లారీని అడ్డుకున్న అన్నదాతలు

స్టేషన్‌ఘన్‌పూర్: మండల పరిధిలో రైతులకు యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. కేవలం ఒక్క యూరియా బస్తా కోసం మండుటెండలో రైతులు గంటల తరబడి లైన్లలో బారులుదీరి నిలబడి అష్టకష్టాలు పడుతున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ పీఏసీఎస్‌కు 286 బస్తాలు, తాటికొండకు 222 బస్తాలు యూరియా స్టాక్ రాగా గురువారం పంపిణీ చేశారు. ఘన్‌పూర్ పీఏసీఎస్‌కు యూరియా స్టాక్ వచ్చిన సమాచారంతో స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో ఉదయం వరకే పీఏసీఎస్ వద్దకు చేరుకుని క్యూలలో నిల్చున్నారు. మండుటెండలో సైతం రైతులు అధిక సంఖ్యలో రాగా ఏఓ, ఏఈఓల పర్యవేక్షణలో పోలీసుల బందోబస్తు మధ్య రైతులకు యూరియా బస్తాల పంపిణీ చేపట్టారు. కాగా, గంటల తరబడి లైన్లలో ఉన్నప్పటికీ యూరియా బస్తాలు అందని రైతులు నిరాశగా వెనుదిరిగారు. యూరియా బస్తాల కోసం రైతులను పలుమార్లు లైన్లలో ఉంచడం, ఆధార్‌కార్డులు, పాసుపుస్తకాల జిరాక్స్‌లు తీసుకుని నంబరింగ్‌తో బస్తాలు పంపిణీ చేయడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారు. బుధవారం లైన్లలో నిల్చున్నవారి వద్ద ఆధార్‌కార్డులు, పాసుపుస్తకాల జిరాక్స్‌లు తీసుకున్నారని, ముందుగా వారిని పంపిణీ చేయాలంటూ రైతులు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో క్యూలైన్లలో రైతులు తోపులాడుకోగా స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఏది ఏమైనా అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారుతుంది.

యూరియా లారీని అడ్డుకున్న రైతులు

జఫర్‌గఢ్: యూరియా కొరతతో మండలంలోని రైతులు పాట్లు పడుతున్నారు. మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయానికి యూరియా వచ్చిన విషయం తెలుసుకున్న రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. యూరియా బస్తాలు అందకపోవడంతో తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసి సొసైటీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అప్పటికే లారీ నుంచి కొన్ని బస్తాలు సొసైటీ వద్ద దింపిన అనంతరం హిమ్మత్‌నగర్ గ్రామానికి మిగతా బస్తాలు తరలించాల్సి ఉండడంతో రైతులు లారీకి అడ్డం తిరిగారు. తమ బస్తాలు ఇచ్చిన తరువాతనే మరో చోటకు పంపించాలంటూ లారీ ఎదుట బైటాయించి నిరసన తెలిపారు.

యూరియా బస్తాల పంపిణీని పరిశీలించిన ఏడీఏ

సొసైటీ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న యూరియా పంపిణీని స్టేషన్‌ఘన్‌పూర్ ఏడీఏ వసంత సుగుణ పరిశీలించారు. యూరియా పంపిణీ విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

'దయాకర్‌రావుపై విమర్శలు చేస్తే సహించం'



కొడకండ్ల: పద్మశాలీలు కోరిక మేరకు కొడకండ్లలో మినిటెక్స్‌టైల్ పార్క్ కోసం రూ.61కోట్ల 54 లక్షలు నిధులను మాజీ మంత్రి దయాకర్‌రావు మంజూరు చేయించడమే కాకుండా ఇందుకు అనువైన తొమ్మిది ఎకరాల భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేయించడం జరిగిందని బీఆర్ఎస్ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేశగాని సతీష్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు మసురం వెంకటనారాయణ, మాజీ సర్పంచ్ రాజ్‌కుమార్‌లు తెలిపారు. గురువారం మండలకేంద్రంలోని టెక్స్‌టైల్ పార్క్ శిలాఫలకం వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలవుతున్నా కూడా ఒక్క హామీని కూడా నేరవేర్చలేకపోయిన కాంగ్రెస్ నాయకులు దయాకర్‌రావుపై వాస్తవాలు తెలుసుకోకుండా అర్ధరహిత విమర్శలు చేస్తే సహించబోమన్నారు. కార్యక్రమంలో నాయకులు శోభన్, షన్నా, మహేష్‌నాయక్, మంగ్యానాయక్, హరీష్, నవీన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ప్రమాణస్వీకారానికి హాజరైన ఎమ్మెల్యే



పాలకుర్తి టౌన్: కర్ణాటక శాసన మండలిలో గురువారం ఎన్ఆర్ఐ ఫోరం ప్రెసిడెంట్ ఆరతి కృష్ణ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి పాల్గొన్నారు. విధాన సౌధలోని బాంకెట్ హాల్‌లో జరిగిన ఆరతి కృష్ణ ప్రమాణ స్వీకారంతో ఆమె నియామకం కాంగ్రెస్ పార్టీకి బలాన్నిచ్చే దిశగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఎన్ఆర్ఐలతో రాష్ట్రానికి ఉన్న అనుబంధాన్ని మరింత బలపస్తుందని అన్నారు.

పీఈటీల పాత్ర కీలకం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్

లింగాలఘణపురం: విద్యార్థుల మానసిక ఉల్లాసంలో పీఈటీల పాత్ర ఎంతో కీలకమని అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని నెల్లుట్ల ఉన్నత పాఠశాలలో జిల్లాలోని 6 మండలాలకు సంబంధించిన పీఈటీల కాంప్లెక్స్ సమావేశం మొదటిసారి నిర్వహించగా అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు యోగ, మెడిటేషన్‌తో క్రమశిక్షణ, చదువుపై శ్రద్ధ, మానసిక పరిపక్వత పెరుగుతుందని, వీటిపై పీఈటీలు విద్యార్థులకు రోజువారీగా అవగాహన, శిక్షణ ఇవ్వాలని కోరారు. అదనపు కలెక్టర్‌తో పాటు ఏఎంఓ శ్రీనివాసు, ఎంఈఓ విష్ణుమూర్తి, డీఆర్‌పీలు మనోజ్, హన్మంతరావు, అశోక్, సంగీత, మాధురీ, దిలీప్ ఆయా మండలాలకు సంబంధించిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికలకు చట్టాలపై అవగాహన ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్



అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

జనగామ రూరల్: బాలికలకు పోక్సో వంటి చట్టాలపై అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ సూచించారు. గురువారం మండలంలోని చౌడారం మోడల్ హైస్కూల్, జూనియర్ కళాశాలలో బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలతో ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే మీరు నమ్మిన వారికి లేదా పోలీసులకు, చైల్డ్ వెల్ఫేర్ అధికారికి గాని జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థకు గాని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, మిషన్ శక్తి డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కె.శారద, ప్రిన్సిపాల్ కె.సుధీర్‌రెడ్డి , పీఎల్‌వీ శేఖర్, పీఎల్‌వీ జితేంద్ర పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

జనగామ రూరల్: విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గుంటుపల్లి కార్తీక్ అన్నారు. గురువారం రాష్ట్రశాఖ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్‌లో రూ. 8,500ల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి సాయి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేందర్, వంశీ, సాయిచరణ్, రాహుల్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాటికొండ విద్యార్థినికి జిల్లాస్థాయి అవార్డు



విద్యార్థిని అశ్వినిని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని ముంత అశ్విని డ్రాయింగ్ పోటీల్లో జిల్లాస్థాయిలో మూడో స్థానంలో నిలిచి అవార్డు గెలుచుకుంది. ఈ మేరకు పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని అశ్వినిని హెచ్ఎం పి.వెంకటేశ్వర్లుతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ.. ఈనెల 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో అశ్విని మండలస్థాయిలో ప్రథమ, జిల్లాస్థాయిలో మూడో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి, ప్రశంసపత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ గిరెడ్డి ప్రమోద్‌రెడ్డి, ఉపాధ్యాయులు రుద్ర లింగమూర్తి, రంజిత్ కుమార్, రవీందర్, డి.శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, మురళి, అనసూయ, సలావుద్దీన్, కృపమ్మ, సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కృత్యమేళా



కృత్యమేళాను పరిశీలిస్తున్న ఎంఈఓ గోవర్ధన్

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలోని ఎస్సీబీసీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం కృత్యమేళా నిర్వహించారు. మండలంలోని 22 ప్రాథమిక పాఠశాలలు, నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్ ఈవీఎస్ నాలుగు విషయాల్లో వారు తయారు చేసిన కృత్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గోవర్ధన్ మాట్లాడుతూ కృత్యాల ద్వారా బోధనతో విద్యార్థుల్లో అవగాహన పెరుగుందని అన్నారు. నూతనంగా ఆలోచించే అవకాశం కలుగుందని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సంపత్‌కుమార్, చింతల కన్నయ్య, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సునీల్

జనగామ రూరల్: ఈనెల 15వ తేదీన నిర్వహించే చేయూత పింఛన్‌దారుల మహాధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఎస్ఎంఆర్ గార్డెన్‌లో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం సోమరాజు అధ్యక్షతన నిర్వహించిన ముఖ్యకార్యాకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో ఇస్తున్నట్లు దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ తెలంగాణలో కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బిర్రు నాగేష్, అధికార ప్రతినిధి సందెన రవీందర్, జేరిపోతుల సుధాకర్, బొట్ల మహేష్ మాదిగ, నలిమేల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

- అడిషనల్ డీఆర్డీఓ చంద్రశేఖర్



ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్న అధికారులు

రఘునాథపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడితే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని అడిషనల్ డీఆర్డీవో చంద్రశేఖర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో 36 గ్రామ పంచాయతీల్లో 1 ఏప్రిల్ 2024 నుంచి 31 మార్చి 2025 వరకు జరిగిన 8,58,40,548 కోట్ల పనులపై గురువారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. గత నెల 29 నుంచి ఈ నెల 10 వరకు ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీలు గ్రామాల్లో ఉపాధి పనులపై తనిఖీలు నిర్వహించారు. ఎస్ఆర్‌పీ గోవింద్ ఖాసన్న ఆధ్వర్యంలో ఓపెన్ ఫోరంలో డీఆర్‌పీలు అడిట్ వివరాలు చదివి వినిపించారు. మస్టర్ల నిర్వహణ సక్రమంగా నిర్వహించకపోవడాన్ని గుర్తించారు. రికార్డులు, తదితర పనుల్లో నిర్లక్ష్యం వహించినందుకు ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులకు రూ. 2,80, 931 జరిమానా విధించారు.

ప్రజలు లేకుండానే ప్రజావేదిక

సామాజిక తనిఖీ ప్రజావేదికను ప్రజలు లేకుండానే నిర్వహించారు. సమాచారం లేదని ఉపాధి కూలీలు, ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతోనే ఓపెన్ ఫోరం మమ అనిపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, డీసీఓ కోదండ రాములు, జిల్లా విజిలెన్స్ అధికారి సంధ్య, క్వాలిటీ కంట్రోల్ అధికారి రాజవర్ధన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఏపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంటులు పాల్గొన్నారు.

గిరిజన హక్కులను కాలరాస్తే ఉద్యమాలు

- సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్

దేవరుప్పుల : రాజ్యాంగపరంగా సాధించుకున్న గిరిజనుల హక్కులను కాలరాస్తే ఉద్యమాలు అనివార్యమని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధారావత్ శంకర్‌నాయక్ హెచ్చరించారు. గురువారం మండలంలోని ధరావత్‌తండాలో ఈ నెల 14 న తలపెట్టిన సేవాలాల్ సేన జనగామ దశాబ్ది సభ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు కోల్పోతున్న సంస్కృతీ సంప్రదాయాలు, పరిరక్షణతోపాటు, రాజ్యాంగంలో కల్పించిన హక్కులు, సమానత్వం, స్వయంపాలన సాధన కోసం ఏర్పడిన ఉద్యమమ ప్రతిరూపమే సేవాలాల్ సేన ఆవిర్భావమన్నారు. సేవాలాల్ సేన జిల్లా ఆర్గనైజ్ సెక్రటరీ ధరావత్ ప్రకాష్, మండల అధ్యక్షుకును సోత్ బిక్కు, సేవాలాల్ సేన డీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రవీందర్ నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పూర్వవైభవానికి పాటుపడుదాం



ఉత్తమ ఉపాధ్యాయులతో ఎంఈఓ కళావతి, సంఘం నాయకులు

దేవరుప్పుల: మారుతున్న పరిస్థితులను అధిగవిస్తూ ప్రభుత్వ పాఠశాలల పూర్వవైభవం కోసం ఉపాధ్యాయ బృందం తోడ్పాటు అందించాలని ఎంఈఓ జి కళావతి సూచించారు. గురువారం మండల విద్యావనరుల కేంద్రంలో మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పీజీ హెచ్ఎంలు జె రాజేంద్రకుమార్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు జి శంకరయ్య, వై పద్మావతి, స్కూల్ అసిస్టెంట్లు ఆర్.సత్యనారాయణ, పి.శ్రీదేవి, జె శంకర్, ఎం శోభ, బి ప్రణీత, డి అశోక్, ఎస్జీటీలు ఎస్.మాలతిలత, బి అంజయ్య, టి.జ్యోతి, ఎస్ కిరణ్‌కుమార్, యు.భాగ్యలక్ష్మీ, ఎం స్వప్నలకు జ్ఞాపికలు అందించి ఘనంగా సన్మానించారు. అలాగే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా నల్ల లలిత (హెచ్ఎం, ఎంపీపీఎస్ మాధాపురం), బి వెంకన్న(ఎస్జీటీ, పీఎస్ పెద్దమదూరు), సీహెచ్ ఆంజనేయులు (ఎస్ఏ బయోకెమిస్ట్రీ, పెద్దమదూ రు హైస్కూల్), కె.లలిత (ఎస్జీటీ, పీఎస్ బస్‌స్టేజీ దేవరుప్పుల), రంజిత్ కుమారీ (ఎస్ఏ తెలుగు, దేవరుప్పుల హైస్కూల్)లకు ఎంఈఓ కళావతితోపాటు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ మండల కమిటీ విస్తరణకు బ్రేక్

దేవరుప్పుల: ఇటీవల నియమించిన యూత్ కాంగ్రెస్ మండల కార్యవర్గ విస్తరణకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఏఐసీసీ అనుబంధ కమి టీల నియామక నిబంధనల మేరకు డిజి టల్ మెంబర్‌షిప్‌ను బట్టి నియమాకమైన యూత్ పదవులను మార్చిన విషయమై ఫిర్యాదుల మేరకు స్పందించిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ జిల్లా, మండల శాఖలకు సత్వరమే ఆ కమిటీ విస్తరణను రద్దు చేయాలని ఆదేశించారు. ఈ విషయమై మండల యూత్ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు పులిగిళ్ల వెంకన్న వివరణ కోరగా ఇటీవల వేసి న కమిటీని తాత్కాలికంగా రద్దు చేస్తూ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు త్వరలో మండల యూత్ కార్యవర్గ విస్తరణ చేస్తామని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య

చిల్పూరు: అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీది ప్రజాపాలన కాదని, ప్రజలను ఘోషపెట్టే పాలన అని బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య అన్నారు. గురువారం ఊరూరికి సంక్షేమ పథకాలు.. ఇంటింటికి కేసీఆర్ ఫలాలు కార్యక్రమంలో భాగంగా కొండాపూర్, శ్రీపతిపల్లి, లింగంపల్లి, మల్కాపూర్, చిల్పూరు, వెంకటేశ్వరపల్లి, తీగలతండ, రాజవరం, చిన్నపెండ్యాల గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అవుతున్నా నేటికీ పేదలకు న్యాయం జరగడం లేదన్నారు. కార్యక్రమంలో ఏడవెల్లి కృష్ణారెడ్డి, జనగాం యాదగిరి, ఆకుల కుమార్, వెన్నం మాధవరెడ్డి, మేడ్చల్ రమేష్, వేముల రవి, నారగోని రవిచంద్ర, శ్రీనివాస్, మాచర్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేయాలి



స్టేషన్‌ఘన్‌పూర్: విధి నిర్వహణలో బాధ్యతగా, అంకితభావంతో పనిచేసేవారికి ఎప్పటికైనా గుర్తింపు లభిస్తుందని ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. జీపీఓలుగా నియామకాలు పొంది బదిలీపై వెళ్తున్న స్థానిక ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది నసీరుద్దీన్, నర్సింహా, వంశీకృష్ణ, శ్రీనివాస్, దాసు, వినోదలను స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో గురువారం సన్మానించారు. డీఏఓ శంకరయ్య, డీఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.